భవిత కేంద్రాన్ని అభివృద్ధి చేస్తాం

సర్వశిక్ష అభియాన్ అసిస్టెంట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్యాంసుందర్

ప్రజాశక్తి - ఉండి

భవిత కేంద్రాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి కావాల్సిన నిధులు ఏర్పాటు చేస్తామని సర్వశిక్ష అభియాన్ అసిస్టెంట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్యాంసుందర్ అన్నారు. గురువారం సాయంత్రం ఉండి భవిత కేంద్రాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ భవిత కేంద్రానికి కావాల్సిన అవసరాలను తెలుసుకోవడం జరిగిందని, భవిత కేంద్రం బిల్డింగ్ మరమ్మతులను త్వరలోనే చేపడతామని అన్నారు. అనంతరం మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి-2 బొక్కా వినాయకుడు, భవిత కేంద్రం ఉపాధ్యాయులు గుండుగొల్లు మధుసూదనరావు ఉన్నారు.

ఎండు గడ్డి కొరత..!

ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో యంత్రాలతో కోతలు
గడ్డి ముక్కలు ముక్కలు కావడంతో అవస్థలు
గడ్డి చుట్టే యంత్రాలవైపు పాడి రైతులు మొగ్గు

ఆచంట వేమవరంలో యంత్రం ద్వారా చుట్టిన గడ్డి కట్టలు

ప్రజాశక్తి - ఆచంట

పశువులకు ఎండు గడ్డి సరిగ్గా దొరకని పరిస్థితి నెలకొంది. దీంతో పాడి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఇటీవల వరికోత యంత్రాల వినియోగం పెరగడంతో గడ్డి కాస్త ముక్కముక్కలుగా అయిపోతోంది. దీంతో పశువులకు నాణ్యమైన గడ్డి అందక రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. రైతులు వరికోత యంత్రాలతో కోతలు కోయిస్తున్న నేపథ్యంలో గడ్డి ఎందుకూ పనికి రాకుండా పొలాల్లోనే ఉండిపోతున్న పరిస్థితి.

గడ్డి చుట్టలను మేటుగా వేసి భద్రపరుచుకుంటున్న పాడి రైతు

మండలంలో 90 శాతం వరకూ వరి కోతలు యంత్రాలతో నిర్వహించడంతో నేడు ఎండు గడ్డికి తీవ్ర కొరత ఏర్పడింది. కొందరు రైతులు వరిచేల్లోనే ముక్కలు ముక్కలుగా అయిపోయిన గడ్డిని సేకరించలేక, సేకరించినా మోపులుగా చేసుకునే వీలు లేకపోవడంతో వరి చేలల్లోనే వదిలేసి తగలబెట్టేస్తున్నారు.

అయితే ఈ తరుణంలో వరి కోత యంత్రాల మాదిరిగానే వరిగడ్డి చుట్టే యంత్రాలు సైతం అందుబాటులోకి రావడంతో వీటిపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇవి గత 4, 5 సంవత్సరాల క్రితమే అందుబాటులోకి వచ్చినా రైతుల చెంతకు చేరడంలో ఆలస్యమైంది. ఈ ఏడాది వ్యవసాయ అధికారులు సైతం ఈ యంత్రాలపై అవగాహన కల్పించడం, ఎండు గడ్డి లేక పాడి పశువులను పోషించడానికి అధిక వ్యయం చేయాల్సి రావడంతో పాడి రైతులు గడ్డి చుట్టే యంత్రాల వైపు ఆసక్తి చూస్తున్నారు. కొత్త యంత్రాలతో వరి మాసూళ్ల పూర్తి చేసిన చేలల్లోని గడ్డిని చుట్టే యంత్రం సేకరించి పురి కుశలతో మోపులుగా చేసి వరిచేల్లో వదిలేస్తుంది. దీన్ని రైతులు సేకరించుకొని ట్రాక్టర్ల ద్వారా లేక, కూలీలతో మోయించుకుంటూ గడ్డిమేట్లు వేసుకుంటున్నారు. ఒక మోపునకు సుమారు రూ.35 వరకూ ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. ఎకరానికి సుమారు 50 నుంచి 60 మోపుల వరకూ గడ్డిని సేకరించగలుగుతున్నారు. దీంతో ఎకరానికి రూ.4 నుంచి రూ.5 వేల వరకూ గడ్డి సేకరణకు ఖర్చవుతోందని రైతులు చెబుతున్నారు. అయితే సేకరించిన గడ్డిని వదిలేయకుండా మేట్లుగా వేసి వర్షం పడినప్పుడు బరకాలతో కాపాడుకుంటున్నామని చెబుతున్నారు.

ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంటను వేగవంతంగా కోసి ఒబ్బిడి చేసుకోవడానికి వరికోత యంత్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని రైతులు చెబుతున్నారు.

మండలంలో 10,150 ఎకరాల్లో దాళ్వా వరి సాగు చేపట్టారు. జులై, ఆగస్టు, సెప్టెంబర్‌లో వచ్చే వరదల కారణంగా పశుగ్రాస కొరత ఏర్పడుతుంది. ముఖ్యంగా వర్షాకాలంలో ఎండుగడ్డిని ఎక్కువగా వినియోగించుకుంటారు. ఆయా నెలలో పశువులకు మేత కొరత రావడంతో ఎకరం గడ్డిని రూ.10 వేలతో కొనుగోలు చేస్తే, మరో రూ.2,000 ట్రాక్టర్ కిరాయికి, గడ్డిమేటు వేయడానికి ఎగుమతి, దిగుమతికి రూ.3 వేలు ఖర్చవుతుంది. మొత్తంగా ఎకరం గడ్డికి రూ.15 వేలు ఖర్చవ్వడంతో రైతులు హడలెత్తిపోతున్నారు. దీంతో రైతులు యంత్రాలు ఆధారపడి ఎండు గడ్డి కొరతను అధిగమించేందుకు గడ్డి చుట్టే యంత్రాలను ఉపయోగించుకుంటున్నారు.

గడ్డి ధర పెరిగింది..

బొర్రా నరసింహారావు, కౌలు రైతు, ఆచంట వేమవరం

ఇప్పటికే గడ్డి, దాణా ధరలు చుక్కలనంటడంతో చాలా మంది రైతులు గేదెలు, ఆవులను కొనుగోలు చేయడానికి ముందుకు రావడం లేదు. దీంతో పశుసంపద తగ్గి రెడీమేడ్ పాలపై ఆధారపడుతున్నారు. గతంలో ఎండు గడ్డిని రైతులు ఉచితంగా ఇచ్చేవారు. ప్రస్తుతం యంత్రాల ద్వారా సేకరించిన గడ్డిని మేట్లుగా వేసుకుని పశువులకు వినియోగిస్తున్నారు.

అందుబాటులో గడ్డి చుట్టే యంత్రాలు

బొక్క బాబూరావు, రైతు, ఆచంట వేమవరం

గడ్డి సేకరణకు అధిక మొత్తంలో కూలి చెల్లించలేక వదిలేస్తున్నాం. వరి కోత యంత్రం లాగానే వరిగడ్డి చుట్టే యంత్రాలు సైతం అందుబాటులోకి రావడంతో వీటిపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఒక మోపునకు సుమారు రూ.35 ఖర్చవుతుంది. ఎకరానికి 50 నుంచి 60 మోపుల వరకూ గడ్డిని సేకరించి మేట్లు వేసుకొని బరకాలతో ఆ గడ్డిని కాపాడుకుంటున్నాం.

ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంతో ప్రాజెక్టులు

రాష్ట్ర పర్యాటక, గృహ నిర్మాణ శాఖల ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్

ప్రజాశక్తి - భీమవరం



మాట్లాడుతున్న రాష్ట్ర పర్యాటక గృహ నిర్మాణ శాఖల ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్

రాష్ట్రంలో పర్యాటకరంగ సమగ్రాభివృద్ధికి నూతన పాలసీని తీసుకొచ్చామని, దీనిలో భాగంగా ప్రభుత్వం ప్రయివేటు భాగస్వామ్యంతో ప్రాజెక్టుల నిర్మాణానికి రూపకల్పన చేశామని రాష్ట్ర పర్యాటక, గృహ నిర్మాణ శాఖల ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ తెలిపారు. ఐదేళ్లలో దేశంలోనే ఏపిని మొదటి స్థానంలో నిలిపేందుకు పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించామన్నారు. కోపల్లె మంతెన హెరిటేజ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అజయ్ జైన్ మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 1,842 హోం స్టే యూనిట్లు ఉన్నాయని, దీనిలో ఒక తిరుపతిలోనే 561 హోమ్ స్టేలు పనిచేస్తున్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలు పర్యాటకులకు ఆకర్షణగా మారడం, వ్యవసాయ క్షేత్రాలు, పల్లె సంస్కృతి, హస్త కళలకు గల ప్రాధాన్యతను ప్రతిబింబించేలా ఈ విధానం సాగుతుందన్నారు. ఈ విధానానికి పశ్చిమగోదావరి జిల్లా కోపల్లెలోని మంతెన హెరిటేజ్ హోం స్టే ఆదర్శంగా నిలిచిందని, ఇక్కడ వాతావరణం పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోందని తెలిపారు. సెర్ప్, మెప్మా మహిళల భాగస్వామ్యంతో దిండి, అరకు ప్రాంతాల్లో పైలెట్ ప్రాజెక్టులు శిక్షణ ఇస్తున్నామన్నారు. పెట్టుబడిదారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం పర్యాటకరంగానికి పారిశ్రామిక హోదా కల్పించడం, మెరుగైన రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. ప్రభుత్వం కొత్త పర్యాటక విధానం ప్రకటించాక ఆతిథ్య రంగంలో ప్రముఖ సంస్థలు రాష్ట్రంలో ఏర్పాటుకు ముందుకొస్తున్నాయని, దీనిలో భాగంగానే ఇప్పటికే దాదాపు 18 వేల మందికి ఉపాధి అవకాశాలు 27 ప్రముఖ హోటళ్ల పనులు ప్రారంభించడం జరిగిందన్నారు.

10 నెలల్లో కీలక నిర్ణయాలు మంత్రివర్గం ఆమోదం..

భారతీయుల దృష్టిలో పర్యాటకమంటే తీర్థయాత్రలు, పుణ్యక్షేత్రాలు మాత్రమే అనుకునే వాళ్లమని, ఇప్పుడు చారిత్రక, ప్రకృతి ప్రదేశాల సందర్శనకు హోం స్టే పర్యాటకులు ఆకర్షితులు అవుతున్నారన్నారు. రాష్ట్రం ఇటు దేవాలయాలు, పుణ్యక్షేత్రాలతో పాటు చారిత్రక, ప్రకృతి సౌందర్య స్థలాలకు నిలయంగా ఉన్నాయన్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుమల దేవస్థానం, శ్రీకాళహస్తి, శ్రీశైలం కాణిపాకం, విజయవాడ కనకదుర్గ దేవాలయం, సింహాచలం, అంతర్వేది, పుష్పగిరి వంటి పుణ్యక్షేత్రాలు, అరకు లోయ, బొర్రా గుహలు, పాపి కొండలు, హార్సిలీ హిల్స్, కొల్లేరు సరస్సు, పులికాట్ సరస్సు వంటి ప్రకృతిక ప్రదేశాలు, అమరావతి స్తూపం, ధవళేశ్వరం బ్యారేజ్ వంటి చారిత్రక ప్రదేశాలు అనేకం ఉన్నాయని తెలిపారు. కృష్ణానదిపై నీటిలో తేలియాడే రెస్టారెంట్ (ఫ్లోటింగ్ రెస్టారెంట్), విజయవాడలో బెర్మ్ పార్క్, కోనసీమ బ్యాక్ వాటర్‌లో సింగిల్ బెడ్‌రూమ్ లగ్జరీ హౌస్ బోట్లను ప్రభుత్వ ప్రయివేటు భాగస్వామ్యంతో ఏర్పాటు చేయనున్నామన్నారు. పోలవరం నుంచి పట్టిసీమ మధ్య తీగల వంతెన, విజయవాడలోని భవానీ ద్వీపంలో థీమ్ పార్క్, వాటర్ పార్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పెట్టుబడుల ప్రోత్సాహక మండలి అనుమతితో మంత్రివర్గం ఆమోదం తర్వాత కేటాయింపులు చేసేలా కొత్త విధానం రూపొందించడం జరిగిందన్నారు. రూ.50 కోట్ల కంటే తక్కువ పెట్టుబడులు పెట్టే సంస్థ (ఎంఎస్ఎంఇ) బిడ్డింగ్ ప్రాతిపదికన భూమి కేటాయింపులు చేస్తామన్నారు. గత పది నెలల వ్యవధిలో ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న రాజధాని అమరావతి ప్రాంతాన్ని కూడా చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడం రాష్ట్రానికి మరింత కలిసొచ్చే అంశమన్నారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్‌డిఒ కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, టూరిజం సహాయ సంచాలకులు ఎ.లాక్ వంతినాయుడు, మేనేజర్ ఎ.రాజ్యలక్ష్మి, కన్సల్టెంట్ డి.సాహితి, జిల్లా టూరిజం అధికారి ఎ.వి.అప్పారావు, డ్వామా పిడి కెసిహెచ్.అప్పారావు, ఐసీడీ హౌసింగ్ పిడి జి.పిచ్చయ్య, ఇఇ ఎం.శ్రీనివాసరావు, తహశీల్దార్ జి.సుందర్ సింగ్, ఎంపిడిఒ జి.స్వాతి, మంతెన హెరిటేజ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులు బ్యాంకు ద్వారా లబ్ధి పొందాలి

యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ సంగీత కుమారి

ప్రజాశక్తి - భీమవరం

రైతుకు రుణ అర్హత పత్రాన్ని అందజేస్తున్న బ్యాంకు రీజనల్ హెడ్ సంగీతకుమారి

రైతుల ఆర్థికాభివృద్ధికి బ్యాంకు రుణాలు కీలకం కావడంతో, ప్రతి రైతూ బ్యాంకు ద్వారా లబ్ధి పొందాలని యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ సంగీత కుమారి తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భీమవరం రీజనల్ కార్యాలయం ఆధ్వర్యంలో పెనుమంట్రలో వ్యవసాయ రుణ అవగాహనా, రుణ వితరణ సదస్సు గురువారం నిర్వహించారు. రైతులకు వివిధ రకాల వ్యవసాయ రుణాలు, అర్హత ప్రమాణాలు, ప్రభుత్వ మద్దతు పథకాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులు తమ రుణ అవసరాల కోసం దరఖాస్తు చేసుకోగా, బ్యాంకు అధికారులు వారి సందేహాలను నివృత్తి చేసి, అవసరమైన సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బ్యాంకు రీజనల్ హెడ్ సంగీత కుమారి మాట్లాడారు. ఈ శిబిరం ద్వారా రూ.70 కోట్ల విలువైన వ్యవసాయ రుణాలను 15 రోజుల్లో మంజూరు చేయడం లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు తెలిపారు. జిల్లాలో మరో రెండు ప్రాంతాల్లో కూడా ఇటువంటి శిబిరాలు నిర్వహించి రైతులకు అండగా నిలవనున్నామని తెలిపారు. అనంతరం రైతులకు రుణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ అధికారి నాగేంద్రప్రసాద్, చీఫ్ మేనేజర్లు శ్రీధర్, లావణ్య, పశువర్ధక శాఖ అధికారిని వరలక్ష్మి, ఎపిఎం పద్మ పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి

యోగాంధ్రాను విజయవంతం చేయాలి

జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

యోగాంధ్రను విజయవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నెలరోజుల ముందు నుంచే యోగాపై పలు కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో యోగాంధ్ర 2025కు తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి ఆయుష్, మెడికల్, ఎడ్యుకేషన్, రెవెన్యూ సంబంధిత శాఖలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో యోగా నిర్వాహకులను గుర్తించి వారి చేత పెద్ద ఎత్తున క్యాంపులు నిర్వహించి ప్రజలను చైతన్య పర్చాలన్నారు. స్కూలు పున్నప్రారంభించిన అనంతరం పాఠశాలలు కళాశాలలో విద్యార్థులకు యోగా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. జూన్ 19వ తేదీన సుమారు 5వేల మంది యోగా కార్యక్రమంలో పాల్గొనేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, అడిషనల్ ఎస్‌పి భీమారావు, ఆర్‌డిఒ కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, గ్రామ, వార్డు సచివాలయం అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పీడీ కెసిహెచ్.అప్పారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డిఎంహెచ్ఒ జి.గీత బాయి పాల్గొన్నారు.

ఎండియు వ్యవస్థ రద్దును ఉపసంహరించుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

ప్రజలకు నిత్యావసరాల పంపిణీలో ఎండియు వ్యవస్థ రద్దు చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, దీంతోపాటు రేషన్‌షాపుల వద్ద కూడా సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. నిర్వహణ లోపాలు సరిదిద్ది, ఎండియు వ్యవస్థను మరింత మెరుగుపర్చాలన్నారు. అవినీతికి తావు లేకుండా ఆధునిక సాంకేతికతో అనుసంధానం చేయాలని కోరారు. ఎండియు వ్యవస్థ ద్వారా ప్రజలకు ఇంటి వద్ద రేషన్ బియ్యం అందించడం ఎంతో సౌకర్యంగా ఉందన్నారు. వాహనం వచ్చే సమయానికి కూలి పనులకు వెళ్లిన పేదలకు ఇది సౌకర్యంగా ఉందన్నారు. వాహనాల వద్ద రేషన్ తీసుకోలేనివారు రేషన్ డిపో వద్ద సరుకులు తీసుకునేట్లుగా ఏర్పాటు ఉండాలి తప్ప మొత్తం వ్యవస్థనే రద్దు చేయడం ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తుందన్నారు. ఈ వాహనాల ద్వారా అక్రమ రవాణా జరుగుతుందనే నెపంతో ప్రజలకు ఇంటి వద్ద బియ్యం అందించకుండా డిపోల వద్దే తెచ్చుకోమనడం సరైంది కాదన్నారు. ఎండియు వాహనాల ద్వారా అక్రమ రవాణా జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యమైన సన్నబియ్యం సరఫరా చేసినట్లయితే ప్రజలందరూ వినియోగించడం వల్ల అక్రమ రవాణా కూడా అరికట్టవచ్చన్నారు. ప్రభుత్వం ఎండియు. వ్యవస్థ రద్దు నిర్ణయం ఉపసంహరించుకోవాలని, కూటమి ప్రభుత్వం వాగ్దానం చేసినట్లుగా బియ్యంతోపాటు కందిపప్పు, నూనె, చింతపండు రేషన్ డిపోల ద్వారా సరఫరా చేయాలని కోరారు.

నేటి తరానికి పర్సా సత్యనారాయణ జీవితం ఆదర్శం

వ్యవసాయ కార్మిక సంఘం పూర్వపు రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం



భీమవరం : పర్సా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీతారాం, నాయకులు

ప్రజాశక్తి - భీమవరం

సింగరేణిలో చిరుద్యోగిగా జీవితాన్ని ప్రారంభించి సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షులుగా, ఎంఎల్ఎగా, ప్రజా నాయకునిగా జీవితాంతం కష్టజీవులను ఐక్యంచేసి అనేక సేవలందించిన పర్సా సత్యనారాయణ జీవితం నేటితరానికి ఆదర్శమని వ్యవసాయ కార్మిక సంఘం పూర్వపు రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో గురువారం పర్సా సత్యనారాయణ వర్ధంతి సభ బి.వాసుదేవరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పర్సా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ సింగరేణి గని కార్మికుల సంఘాన్ని ఏర్పాటు చేయడంలో తన ఉపాధిని సైతం కోల్పోయి కార్మికుల పక్షాన నిలబడ్డారని అన్నారు. ఒకానొక సందర్భంలో తీవ్ర నిర్బంధంలో కూడా ప్రాణాలను ఫణంగా పెట్టి కష్టజీవుల సంక్షేమం కోసం నిలబడ్డారన్నారు. జీవితాంతం త్యాగాలతో కొనసాగిన పర్సా సత్యనారాయణ ఎంఎల్ఎగా కూడా తన జీవితాన్ని ప్రజలకు అర్పించారన్నారు. జైలు, కేసులు, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వెనుతిరగలేదన్నారు. ప్రజాప్రతినిధిగా అందుకున్న పెన్షన్ కూడా ప్రజా ఉద్యమాలకు అందించారని గుర్తుచేశారు. వాసుదేవరావు మాట్లాడుతూ పర్సా చూపిన దారిలో భీమవరంలో కార్మిక సంఘాలు పనిచేస్తున్నాయన్నారు. అనేక మంది వీరులను, త్యాగధనులను సిఐటియు మనకు అందించిందన్నారు. ప్రజల కోసం పనిచేసే నాయకులకు ఎప్పటికీ మరణం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, పట్టణ పేదల సంక్షేమ సంఘం నాయకులు ఎం.వైకుంఠరావు, సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు, బజార్ జట్టు కార్మిక సంఘం నాయకులు వెంకటేశ్వరరావు, కృష్ణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బి.వరలక్ష్మి, రాజు రైస్‌మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కలిపిండి సత్యనారాయణ, రైతుసంఘం నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు, డి.త్రిమూర్తులు పాల్గొన్నారు.

పాలకొల్లు : పర్సా సత్యనారాయణ స్ఫూర్తితో కార్మిక హక్కుల రక్షణకై ఐక్యంగా పోరాడాలని సిఐటియు నాయకులు జవ్వాది శ్రీనివాస్ అన్నారు. గురువారం పర్సా సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించి మాట్లాడారు. సిఐటియు ఆవిర్భావం నుంచి రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేసారన్నారు. కార్మిక హక్కులు, సమసమాజం కోసం పనిచేసారన్నారు. నేడు కార్మిక హక్కులు హరించే విధంగా కార్మిక చట్టాల స్థానంలో లేబర్ కోడ్స్ తెస్తున్నారన్నారు. లేబర్ కోడ్స్ కార్మికున్ని బానిసత్వంలోకి వీడతాయన్నారు. లేబర్ కోడ్స్ రద్దుకై జులై 9న జరిగే సమ్మెలో అందరూ పాల్గొని కోడ్స్‌ను తిప్పి కొట్టాలన్నారు. దీనిలో వీరవల్లి సత్యనారాయణ, కృపావరం, కృష్ణ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో నివాళి అర్పిస్తున్న నాగేశ్వరరావు, నాయకులు

పాలకొల్లులో..

ఆకివీడులో..

తాడేపల్లిగూడెం : శ్రమజీవుల హక్కుల కోసం, సామాజిక సమానత్వం కోసం, దుర్మార్గపు పాలకులకు వ్యతిరేకంగా జీవితమంతా పోరాడిన యోధుడు పర్సా సత్యనారాయణ అని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు తెలిపారు. తాడేపల్లిగూడెం సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పర్సా సత్యనారాయణ 10వ వర్ధంతి సభ గురువారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో జవ్వాది శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా పర్సా సత్యనారాయణ చిత్రపటానికి సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్సా సత్యనారాయణ భారత కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రముఖ నాయకుడిగా ప్రసిద్ధిగాంచారని, ఆంధ్రప్రదేశ్‌లోని కమ్యూనిస్టు ఉద్యమానికి నిలిచిపోయిన నాయకుల్లో ఆయన ఒకరని తెలిపారు. శ్రమజీవుల హక్కుల కోసం పోరాడారని కొనియాడారు. సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ పాలకుల దుర్నీతిపై, ప్రజలపై జరిగే దౌర్జన్యాలపై నిరంతరం పోరాటం సాగించారని, ఆయన ప్రసంగాలు ప్రజలలో చైతన్యం రేపేవని, వ్యవసాయ కార్మికుల, పేదల సమస్యలపై ఎప్పుడూ గళం విప్పేవారని ఆయన అన్నారు. సిపిఎం కీలక నాయకుడుగా ఉన్న ఆయన 1962లో పాల్వంచ నియోజకవర్గం నుంచి ఎంఎల్ఎగా గెలుపొంది సుదీర్ఘకాలం కమ్యూనిస్టు ఉద్యమంలో వివిధ హోదాల్లో పనిచేసిన పర్సా కార్మిక పక్షపాతిగా గుర్తింపు పొందారన్నారు. ఈ వర్ధంతి సభలో సిఐటియు పట్టణ అధ్యక్షులు జవ్వాది శ్రీను, అయినాల సత్యనారాయణ, లచ్చిపతుల శ్రీను, యడవల్లి వెంకట దుర్గారావు, అడపా లోవ, కన్నంరెడ్డి శివాజీ, చిట్టేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆకివీడు : కార్మిక నేత, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు పర్సా సత్యనారాయణ పదవ వర్ధంతి గురువారం సిపిఎం కార్యాలయంలో జరిగింది. సత్యనారాయణ చిత్రపటానికి సిపిఎం ఏరియా కార్యదర్శి కె.తవిటి నాయుడు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కార్మిక ఉద్యమ స్థాపనకు కృషిచేసిన వారిలో పర్సా అగ్రగన్యులని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్‌కె.వలి, పెంకి అప్పారావు, డి.రవితేజ, బివి.వర్మ, ఎస్.సూరిబాబు, కందుల వెంకటేశ్వరరావు పాల్గొని నివాళులు అర్పించారు.

టీచర్ల బదిలీలకు హెల్ప్‌డెస్క్

ప్రారంభించిన యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి.కృష్ణకుమారి

ప్రజాశక్తి - నరసాపురం



హెల్ప్ డెస్క్ ప్రారంభిస్తున్న పి.కృష్ణకుమారి

నరసాపురం యుటిఎఫ్ కార్యాలయంలో టీచర్స్ ట్రాన్స్‌ఫర్స్‌కు సంబంధించి హెల్ప్ డెస్క్‌ను యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి.కృష్ణకుమారి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నరసాపురం మండలశాఖ అధ్యక్షులు ఎన్‌వి.సత్యనారాయణ మాట్లాడుతూ బదిలీలు, ప్రమోషన్ల కోసం ఉపాధ్యాయుల డిమాండ్ మేరకు ప్రభుత్వంతో ప్రాతినిధ్యాలు జిల్లా కేంద్రాలలో ధర్నాలు, డైరెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాలు, మిగిలిన ఉపాధ్యాయ సంఘాలతో ఐక్యవేదిక ఏర్పరిచి, పోరాటానికి పిలుపునిచ్చి, చాలావరకు ఉపాధ్యాయులకు అనుకూలమైన నిర్ణయాలను సాధించడం జరిగగిందన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్స్ విషయంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పరిచిన సహాయ కేంద్రానికి వచ్చి ఉపాధ్యాయులు ఆన్‌లైన్ అప్లికేషన్స్ ఉచితంగా చేయించుకోవచ్చని, ఏమైనా అనుమానాలు ఉంటే నివృతి చేసుకోవచ్చని ఉపాధ్యాయులను కోరారు. నరసాపురం యుటిఎఫ్ భవనంలో ట్రాన్స్‌ఫర్స్ హెల్ప్ కార్యక్రమంలో మండల సహాధ్యక్షులు ఎన్.విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఎస్.అజయ్ కుమార్, కార్యదర్శి బిఎల్‌జె.గాంధీ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ భవనం ప్రారంభం

ప్రజాశక్తి - పెనుమంట్ర

పోలీస్‌స్టేషన్ ప్రారంభిస్తున్న ఎస్‌పి, ఎంఎల్‌ఎ

పెనుమంట్రలో నూతనంగా ఏర్పాటుచేసిన పోలీస్‌స్టేషన్ భవనాన్ని మాజీ మంత్రి, ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ, జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి ప్రారంభించారు. గురువారం ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంఎల్‌ఎ పితాని, ఎస్‌పి, డిఎస్‌పిలను శాలువాతో సన్మానించి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో నరసాపురం డిఎస్‌పి శ్రీవేద, పెనుగొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాయుడు విజయ్‌కుమార్, పెనుమంట్ర ఎస్‌ఐ స్వామి, పెనుగొండ ఎస్‌ఐ గంగాధర్, ఆచంట ఎస్‌ఐ వెంకటరమణ పాల్గొన్నారు. ఎస్‌పి పోలీస్ స్టేషన్‌కు నూతన భవనాన్ని అందించిన జిల్లా కలెక్టర్ నాగరాణి, స్థానిక ఎంఎల్‌ఎ పితానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కుట్టు శిక్షణ తరగతుల తనిఖీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

శిక్షకులతో మాట్లాడుతున్న కమిషనర్ ఏసుబాబు

ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ద్వారా స్థానిక 8వ వార్డు ప్రగతి కాలేజ్, 23వ వార్డు ప్రైమరీ స్కూల్‌లో జరుగుతున్న ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాలను తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న శిక్షణా తరగతుల వసతులు, శిక్షణ వివరాలు ట్రైనర్స్ నుంచి అడిగి తెలుసుకున్నారు. శిక్షణకు వచ్చిన వారి హాజరు తనిఖీ చేశారు.

నరసాపురం-తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు

నరసాపురం: వేసవి రద్దీని పరిగణలోకి తీసుకొని నరసాపురం–తిరుపతి మధ్య జూన్, జులై లో ప్రతి ఆది, సోమవారాల్లో ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు స్టేషన్ మేనేజర్ గణపతి మధుబాబు చెప్పారు. జూన్ నుంచి ప్రతి ఆదివారం రాత్రి 10.20కు తిరుపతికి 07131 నెంబరుతో ప్రత్యేక రైలు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు నరసాపురం చేరుకుంటుంది. తిరిగి సాయంత్రం 3.50కు 07132 నెంబర్ నరసాపురంలో బయలుదేరి తెల్లవారుజాము 3.20కి తిరుపతి చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు జులై 27 వరకు నడుస్తాయన్నారు. జిల్లాలో నరసాపురం, పాలకొల్లు, వీరవాసరం, భీమవరం జంక్షన్, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు స్టేషన్లో ఆగుతుందన్నారు. విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, వెంకటగిరి మీదుగా నడుస్తుందని ఎస్ఎం చెప్పారు.

యోగాతో మానసిక ఆరోగ్యం

డిఎస్పి డాక్టర్ జి.శ్రీవేద

ప్రజాశక్తి - నరసాపురం

యోగా సాధన చేయడం ద్వారా మానసిక బలహీనతలు, ఉద్వేగాలు, ఉద్రేకాలను అదుపులో ఉంచుకోవచ్చని నరసాపురం డిఎస్పి డాక్టర్ జి.శ్రీవేద అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని నరసాపురం పట్టణంలోని వైఎన్ కళాశాలలో నిర్వహించిన యోగాంధ్ర ప్రారంభ వేడుకలను గురువారం డిఎస్పి జి.శ్రీవేద ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీవేద మాట్లాడుతూ యోగా కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, మానసిక ప్రశాంతతకు, ఒత్తిడి నివారణకు కూడా ఎంతగానో తోడ్పడుతుందని తెలియజేశారు. ముఖ్యంగా పోలీసు సిబ్బందికి ఇది ఒత్తిడిని తగ్గించడంలో ఎంతగానో సహాయపడుతుందన్నారు. యోగా సాధకులలో ఆత్మస్థైర్యం, ఆత్మశాంతి అక్రమాలు చేయడం, దుర్వ్యసనాలు వ్యవహరించడం కనిపించడం లేదన్నారు. యోగాంధ్ర వంటి సామూహిక యోగా కార్యక్రమం సమాజంలో ఐక్యతను పెంపొందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నరసాపురం పట్టణ సిఐ బి.యాదగిరి, టౌన్ ఎస్ఐ సిహెచ్.జయలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

జనసేనలోకి పలువురు..

ప్రజాశక్తి - నరసాపురం

జనసేన సిద్ధాంతాలు, పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఆశయాలు నచ్చి నరసాపురం ఎంఎల్ఎ, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు జనసేనలో చేరారు. ఇటీవల వైసిపికి రాజీనామా చేసిన నరసాపురం 19వ వార్డు కౌన్సిలర్ కేసరి గంగరాజు, వైసిపి 27వ వార్డు కౌన్సిలర్ గోరు రమాదేవితో పాటు సుమారు 100 మంది కార్యకర్తలు జనసేన కార్యాలయంలో పార్టీ కండువా కప్పుకొని అధికారికంగా చేరారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరూ మన కుటుంబ సభ్యులుగా భావించి పార్టీ అభివృద్ధి కోసం కృషిచేయాలన్నారు. మన నాయకుడు పవన్ కళ్యాణ్ ఆశయాల సాధన కోసం ప్రతి కార్యకర్త ప్రయత్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోటిపల్లి వెంకటేశ్వరరావు, వలవల నాని, ఆకన చంద్రశేఖర్, గంట కృష్ణ, బందెల రవీంద్ర, నిప్పులేటి తారక రామారావు, పొలిశెట్టి నళిని, అంబటి అరుణ పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా ఎర్రకాలువ గండి పూడిక పనులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పిలుపుమేరకు కూటమి నాయకులు ఎర్రకాలువ గండ్ల పూడిక పనులు గురువారం స్వచ్ఛందంగా చేపట్టినట్లు వారు తెలిపారు. రాబోయే వర్షాకాలంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో యుద్ధప్రాతిపదికన పూడిక పనులు చేపట్టడం జరిగిందని మండలంలోని కూటమి నాయకులు తెలిపారు. అప్పారావుపేటలో ఎనిమిది వందల ఎకరాల పంటను ముంచే గండిని నీటి సంఘం అధ్యక్షుడు గండం చంటిబాబు, సర్పంచ్ ఆదురోట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపదికన గండి పనులు చేపట్టామన్నారు. రానున్న వర్షాకాలంలో ఒక్క ఎకరం కూడా వరద ముంపు వల్ల నష్టపోకూడదని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఈ పనులు చేపడుతున్నామని వారు పేర్కొన్నారు. మండలంలోని సుమారు 15 గండ్లు పూడిక చేపట్టాల్సి ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి ఒక ఉద్యోగం

రాష్ట్ర విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రభుత్వం అందించే ఉచితాలకు కాకుండా కుటుంబానికి ఒక ఉద్యోగం అనే ధోరణితో నియోజకవర్గంలోని ప్రతి పౌరుడు ఆలోచన చేయాలని, తద్వారా రాష్ట్రంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గం ప్రథమ స్థానంలో నిలుస్తుందని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక వాసవి డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీసెస్ ఆధ్వర్యంలో జరిగిన ఉద్యోగ మేళాకు ఆయన ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో నిరుద్యోగాన్ని రూపుమాపేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆలోచనతో పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తూ 100 ఎకరాల భూమిని ఇండస్ట్రియల్ కారిడార్ కేటాయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. గత ప్రభుత్వ పాలనలో వైద్యం ఫ్రీ, విద్య ఫ్రీ అంటూ ప్రజలు ముఖ్యమైనవి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారన్నారు. ఇప్పటికైనా ప్రజలు సంపదకు ఒకసారి ప్రభుత్వం ఇచ్చే పథకాల వైపు కాకుండా యువత తమ కాళ్లపై తాము నిలబడే విధంగా ఉద్యోగాల వైపు అడుగులు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం స్థానిక వాసవి డిగ్రీ కళాశాలలో జరిగిన ఈ మెగా జాబ్ మేళాకు 322 మంది అభ్యర్థులు హాజరు కాగా 104 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ మద్దాల రామకృష్ణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవాసవి డిగ్రీ కళాశాల ఛైర్మన్ ఎవి.రమణరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మండ బ్రహ్మాజీ, ట్రెజరర్ నున్న బాలత్రిపుర సుందర్రావు(సుందరం), జనసేన నాయకులు, వాసవి కాలేజ్ యాజమాన్య నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆర్ఎంపిలు అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించరాదు

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జి.గీతాబాయి

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గర్భిణులు అర్హులైన వైద్యులనే సంప్రదించాలని, నాటు వైద్యులను, ఆర్ఎంపిలను ఆశ్రయించవద్దని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జి.గీతాబాయి తెలిపారు. ఈ సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్ఎంపిలు, గర్భిణులు అల్ట్రాసౌండ్ స్కానింగ్ కోసం రిఫర్ చేయకూడదని, గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా వైద్యుల సలహా మేరకు ప్రభుత్వాసుపత్రిలో వైద్యం పొందడం వల్ల మాతృ మరణాలు, శిశుమరణాలు నియంత్రించవచ్చని, 9 నెలల గర్భిణీ సమయంలో కనీసం 2 సార్లు స్కానింగ్ తప్పనిసరి అని, పిల్లల పెరుగుదల తెలుసుకోవచ్చని, జన్యుపరమైన వ్యాధులు, అంగ వైకల్యాలు నిర్ధారించుటకు ప్రతి గర్భిణీ అర్హులైన వైద్యులనే సంప్రదించాలని ఆమె తెలిపారు.

వేసవి విజ్ఞాన తరగతుల్లో పుస్తక పఠనం

ప్రజాశక్తి - నరసాపురం

ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు ఎంతో ఆసక్తికరంగా, ఉత్సాహంగా జరుగుతున్నాయి. శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం పిల్లల చేత పుస్తకాలు చదివించారు. హిందీ క్లాసులు భట్టిప్రోలు సత్యనారాయణ, శ్రావణ్ సత్యనారాయణ మ్యాథ్స్ క్లాసు, క్రాఫ్ట్ టీచర్ బి.లక్ష్మీబాయి, ఎస్.శాంతి కుమారి క్రాఫ్ట్ ఆర్ట్స్ పై శిక్షణ ఇచ్చారు. గ్రేడ్ఎన్ లైబ్రేరియన్ కెబిఎస్ఎల్.కుమారి పర్యవేక్షించారు.

పెనుమంట్ర : మండలంలోని మార్టేరు శాఖా గ్రంథాలయంలో గురువారం వేసవి విజ్ఞాన శిబిరం 23వ రోజు నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు పి.సువర్ణరాజు గురువారం పిల్లలకు స్పోకెన్ ఇంగ్లీష్, ఫేమస్ కొటేషన్స్ పిల్లలకు చెప్పారు. గ్రంథాలయ మాస్టర్ పిటిఎస్.కుమార్ పిల్లల చేత గ్రంథాలయంలోని జికె, తెలుగు కథల బుక్స్ చదివించారు. ఈ వేసవి విజ్ఞాన శిబిరంలో బి.హసిని, కె.శేఖర్, బి.శివరామకృష్ణ రెడ్డి పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి సందర్భంగా అన్నసమారాధన

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలకేంద్రం మొగల్తూరులో భక్త ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం భారీ అన్న సమారాధన చేశారు. హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. పాల్గొన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వహణ కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

తాడేపల్లిగూడెం : అభయాంజనేయస్వామి ఆలయం వద్ద హనుమాన్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అభయాంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఒత్తిడి లేని విద్యాబోధన ఆదిత్య సొంతం

చదువుతోపాటు విద్యార్థి ఉన్నతి మా లక్ష్యం

ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఉండ్రమట్ల సాంబశివరావు

ఆదిత్య విద్యాసంస్థ


ఛైర్మన్ సాంబశివరావు, కనకదుర్గ దంపతులు

ప్రజాశక్తి - ఆకివీడు

చదువు ఒక్కటే కాదు విద్యార్థి గుణశీలాలు, సామాజిక, మానసిక ఉన్నతి తద్వారా దేశ సౌభాగ్యానికి అతను ఉపయోగపడటం ఇవి మా విద్యాసంస్థ ఏర్పాటు లక్ష్యాలని స్థానిక ఆదిత్య విద్యాసంస్థల వ్యవస్థాపక ఛైర్మన్, యోగసనాచార్య డాక్టర్ ఉండ్రమట్ల సాంబశివరావు, ప్రిన్సిపల్ కనకదుర్గ అన్నారు. స్థానిక ముస్లిం వీధి, నగర పంచాయతీ కార్యాలయం వీధులలో రెండు విద్యాసంస్థలు నిర్వహిస్తున్నారు. ఆదిత్య విద్యాసంస్థ ద్వారా 1995లో తాను సిద్ధ సమాధి యోగలో పాల్గొని స్పందనతో గురుకుల విద్యని విద్యార్థులకు బోధించాలనే లక్ష్యంతో 1997లో ఈ పాఠశాలను స్థాపించామని చెప్పారు. ఆనాడు 80 మందితో ఈ పాఠశాలను ప్రారంభించి నేటికి 1450 మందికి చేరామని ఆయన వివరించారు. కన్న తల్లిదండ్రులను, గురువుని గౌరవించలేని వాడు సాటి మనిషిని గౌరవించలేడు. ఆ గౌరవం, విద్య, వినయం తద్వారా వివేకం ఏర్పడితే విద్య సహజసిద్ధంగా అలవాటవుతుందంటారూ ఆయన. శాఖాహారం మానవుడి ఆరోగ్యాన్ని, మానసిక స్థిమితాన్ని, మనోసంకల్పాన్ని అభివృద్ధి చేస్తుందన్నారు. ఆ కోవలోనే తమ పాఠశాల విద్యార్థులు తమ లక్ష్యాన్ని సాధిస్తున్నారన్నారు. పాఠశాల విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి మాంసాహారాన్ని అంగీకరించమన్నారు. ఇంటి వద్ద కూడా మానేయమని సలహా ఇస్తామన్నారు. అదే తరహాలో బజారు ఆహారాలు కూడా ఇక్కడ అంగీకరించేది లేదన్నారు. తల్లి ఇంటి వద్ద నుంచి ఇచ్చిన ఆహారాన్ని మాత్రమే అంగీకరిస్తామన్నారు. ఆరవ తరగతి నుంచి విద్యార్థులకు ప్రతిరోజు ఇక్కడ రెండు లీటర్ల నీరు తాగిస్తామని చెప్పారు. వారు ఆ నీరు ఇంటి వద్ద నుంచి తెచ్చుకుంటారన్నారు. 2000 సంవత్సరంలో తమ పాఠశాల నుంచి మొట్టమొదట పదవ తరగతి బ్యాచ్ హాజరయ్యారని చెప్పారు. ఆనాడు 500 మార్కులు సాధించిన విద్యార్థుల స్థాయి ఈనాడు 590 మార్కులకు చేరిందన్నారు. ప్రభుత్వం గ్రేడ్ పాయింట్లు ప్రకటించిన సంవత్సరాలలో తమ పాఠశాల విద్యార్థులు కనీసం 8 మందికిపైగా 10/10 పాయింట్లు సాధించి జిల్లాలో ఉన్నత స్థాయిలో నిలిచారన్నారు. ఈ సంవత్సరం ఖ్యాతి ప్రియాంక 590 మార్కులు సాధించి మండలంలో ఉత్తమ స్థానంతో పాటు జిల్లాలో కూడా స్థాయి సంపాదించిందన్నారు. చదువు, ఆరోగ్యం మానసిక విశ్రాంతి కోసం విద్యార్థులకు యోగ, ధ్యానం, ప్రాణాయామం అంశాలకు ఇక్కడ ప్రాధాన్యమిస్తామన్నారు. ప్రతి నిత్యం ప్రతి విద్యార్థి కనీసం ఒక పిరియడ్‌లో పూర్తిగా ఇక్కడ ఈ అంశాలలో పాల్గొంటారన్నారు. చిన్నయ్య మిషన్ ఇంటర్నేషనల్ వారు నిర్వహించే భగవద్గీత పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు గత 15 సంవత్సరాలుగా రాష్ట్రస్థాయిలో బహుమతులు గెలుస్తున్నారని చెప్పారు. వాటితో పాటు కరాటేలో జాతీయ స్థాయి బహుమతులు సైతం గెలుపొందామని చెప్పారు. సామాజిక చైతన్య వికాసంతోటే విద్య సాధ్యమని నమ్మి గురుకుల విద్యా విధానంలో తమ పాఠశాల విధానం సాగుతుందని సాంబశివరావు తెలిపారు.


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ లక్ష్మీసరోజ

ఎపి ఐసెట్‌లో ఆదిత్య విద్యార్థికి 180వ ర్యాంకు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలకు చెందిన పి.మెహర్ వివేక్‌కు ఎపి ఐసెట్‌లో 180వ ర్యాంకు వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపల్ పి.లక్ష్మీ సరోజ తెలియజేశారు. ఈ ర్యాంకుతో పాటు తమ కళాశాల విద్యార్థులు వెయ్యి లోపు, 2 వేల లోపు, 5 వేల లోపు సుమారు 50 ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ ఫలితాలు కేవలం తమ సిఆర్‌టిలో భాగమైన అర్థమెటిక్ రీజనింగ్ వల్ల సాధ్యమైందని తెలిపారు. డైరెక్టర్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మా కళాశాల విద్యార్థులు ఇప్పటికీ ఈ సంవత్సరంలో 438 పైచిలుక ఉద్యోగాలు సాధించారన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఛైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, సెక్రటరీ ఎన్.సుగుణా రెడ్డి అభినందించారు.

26 నుంచి వరి విత్తనాలు అమ్మకం

అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ టి.శ్రీనివాస్

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఈనెల 26 నుంచి తక్కువ కాలపరిమితి ఎంటియు 1262 (150 రోజుల కాలపరిమితి), ఎంటియు 1224(140 రోజుల కాలపరిమితి) కలిగిన బిపిటి 5204 ప్రత్యామ్నాయంగా విడుదల చేసిన సన్నగింజ వరిరకం విత్తనం అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. ఈ ప్యాకింగ్ సైజ్ 25 కిలోలు వెల రూ.1175 ఈ అవకాశాన్ని రైతులందరూ వినియోగించుకోవడానికి డాక్టర్ ఎన్.వెరోనిక, శాస్త్రవేత్త 8985059378, డాక్టర్ ఎంవి.కృష్ణాజీ, ప్రధాన శాస్త్రవేత్త 7780591943ను సంప్రదించాలని ఆయన కోరారు. విత్తనాలు ఫారం పనిరోజుల్లో ఉదయం 9.00 నుంచి 12.00 వరకు తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు అమ్మకం జరుగుతుందని, ఆన్‌లైన్ పేమెంట్ సౌకర్యం కూడా ఉందని ఆయన పేర్కొన్నారు.

ప్రమాదకర ప్రాంతాల పరిశీలన

ప్రజాశక్తి - ఆకివీడు

రహదారి ప్రమాదాల నివారణకు జిల్లా కలెక్టర్ చేపట్టిన కార్యక్రమంలో భాగంగా రోడ్లు–జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించే కార్యక్రమం అధికారులు ప్రారంభించారు. ఈక్రమంలో భాగంగా గురువారం ఈ అధికారిక బృందంలో సభ్యులైన స్థానిక పోలీస్ హౌస్ ఆఫీసర్ ఎస్ఐ హెచ్.నాగరాజు, రోడ్ల భవనాలు శాఖ భీమవరం డివిజన్ డిఇఇ సిహెచ్ టివి.ప్రసాద్, ఎన్‌హెచ్‌డిఇఇ ఎన్.శ్రీనివాసరావు, ఆర్ అండ్ బి భీమవరం ఎఇ సబిర అహ్మద్, ఆర్‌అండ్‌బి ఆకివీడు ఎఇ శ్రీహరిబాబు, రవాణా శాఖ తనిఖీ అధికారి(బ్రేక్ ఇన్‌స్పెక్టర్) కెఎస్ఎన్.ప్రసాద్ మండల కేంద్రంలో ఆకివీడులోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ముందుగా ప్రమాదాలకు నిలవైన జిల్లా సరిహద్దు ఉప్పుటేరు మలుపు వద్ద ఉన్న ప్రాంతాన్ని గుర్తించి అక్కడ ఏరకమైన చర్యలు తీసుకోవాలనే అంశాన్ని చర్చించినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. పట్టణంలో మరిన్ని ప్రాంతాలను గుర్తించామని, మరొకసారి ఈ పరిశీలన చేస్తామని ఆయన తెలిపారు.

త్రిదళాల సైనికుల సాహసాలకు, త్యాగాలకు వందనం

మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

భారత దేశ ఔన్నత్యం నిలిపిన త్రిదళాల సైనికుల సాహసాలకు, త్యాగాలకు అందరూ వందనాలు అర్పించాలని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు మండలంలోని నత్తా రామేశ్వరం గ్రామంలో దేశం ఘనంగా ప్రారంభించిన ఆపరేషన్ సిందూర్ విజయం సాధించిన సందర్భంగా ఆచంట అసెంబ్లీ పరిధిలో బైకులతో తిరంగా ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచంట నియోజకవర్గంలో ఉన్న ఎక్స్ ఆర్మీ, మిలట్రీ, బిఎస్ఎఫ్ జవాన్లను ఎంఎల్ఎ పితాని ఘనంగా సన్మానించారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా త్రివిధ దళాలకు మద్దతుగా ర్యాలీలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. నత్త రామేశ్వరం నుంచి మార్టేరు సెంటర్ మీదుగా ఆచంట మండలం కోడేరు వరకు సాగిన ఈ తిరంగా బైక్ ర్యాలీలో పెనుమంట్ర, పోడూరు, పెనుగొండ, ఆచంట మండలాలకు చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ

టాటా సంస్థతో కలిసి పనిచేయడం గర్వకారణం

సంసిద్ధ్ ఇంటర్నేషనల్ స్కూల్ సిఇఒ ఇందు షానో

ప్రజాశక్తి - నరసాపురం

లోగో ఆవిష్కరిస్తున్న సిఇఒ ఇందుషానో

సంసిద్ధ్ ఇంటర్నేషనల్ స్కూల్ టాటా సంస్థతో కలిసి పనిచేయడం గర్వకారణమని సంసిద్ధ్ సిఇఒ ఇందు షానో అన్నారు. టాటా క్లాస్ ఎడ్జ్ సంస్థ ఇంటర్నేషనల్ స్కూల్‌తో కలిసి గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ముందుకు రావడం శుభ పరిణామమని తెలిపారు. నరసాపురం వాసవి కళ్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రఖ్యాత సంసిద్ధ్ ఇంటర్నేషనల్ స్కూల్, దేశ విఖ్యాత టాటా క్లాస్ ఎడ్జ్‌తో కలిసి పనిచేసేందుకు ఒప్పందం కుదిరింది. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సంసిద్ధ్ ఇంటర్నేషనల్ స్కూల్ సాధారణ విద్యార్థులలోని నైపుణ్యాన్ని వెలికితీసి స్టేట్ ర్యాంకర్లుగా తీర్చిదిద్దేందుకు ముందంజలో ఉందన్నారు. ఈ కార్యక్రమానికి నరసాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ పేద విద్యార్థులకు అతి తక్కువ ఫీజులతో సిబిఎస్ సిలబస్‌తో పాటు కంప్యూటర్, విలువలతో కూడిన విద్యను అందించటం అభినందనీయమన్నారు. ప్రిన్సిపల్ లావణ్య మాట్లాడుతూ విద్యా ప్రమాణాలకు అనుగుణంగా దేశంలోనే అగ్రగామిగా నిలిచిన టాటా సంస్థతో ఒప్పందం కుదుర్చుకోవడం వల్ల స్కూల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ మేనేజర్ నారాయణ బాబు, శ్రీదేవి, సుధీర్, రాజా, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

అధిక రక్తపోటుపై అవగాహన


గణపవరంలో అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - గణపవరం

అధిక రక్తపోటుపై గర్భిణులకు గణపవరం పిహెచ్‌సిలో గురువారం అవగాహన కార్యక్రమమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ కె.ఓంకార్ నాద్ మాట్లాడుతూ ప్రపంచ ఎక్లంప్సియా దినోత్సవం సందర్భంగా గర్భవతులకు ఈ అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గర్భిణులు తప్పనిసరిగా ధ్యానం, యోగా చేయటం వల్ల వారికి ఉపశమనం కలుగుతుందని చెప్పారు. వారానికి ఐదురోజులు 30 నిమిషాల పాటు నడవటం మంచిదన్నారు. దీంతోపాటు తగినంత విశ్రాంతి తీసుకోవాలని చెప్పారు. ఎవరికైనా అధిక రక్తపోటు ఉంటే వైద్యాధికారితో వైద్యపరీక్షలు చేయుంచుకోవాలని అన్నారు. డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ ఆకుకూరలు, పండ్లు, పాలు, కాల్షియం ఉన్న ఆహారం తీసుకోవాలన్నారు. కాల్షియం మాత్రలు వాడటం వల్ల అధిక రక్తపోటు తగ్గించవచ్చునని తెలిపారు. అయిదు నెలలు నిండిన గర్భవతులకు రక్తపోటు వల్ల గుర్రపు వాతము వచ్చే అవకాశం ఉందని, అందువల్ల రక్తపోటు ఉంటే వెంటనే స్థానిక ప్రసూతి వైద్యులతో పరీక్షలు చేయించుకోవాలని, తగిన జాగ్రత్తలు తీసుకుంటే తల్లి, బిడ్డలను కాపాడుకోవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్ బాబు, పబ్లిక్ హెల్త్‌నర్సు సిహెచ్.సత్యవతి, హెచ్‌విసిహెచ్.పద్మజ, ఆరోగ్య కార్యకర్తలు ఎం.యేహాన్, ఎం.నల్లయ్య, ఎ.కృష్ణ, ఆశాలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సుధా లక్ష్మి గర్భిణులకు అధిక రక్తపోటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఐఒ మాట్లాడుతూ గర్భిణులలో అధిక రక్తపోటు నమోదు కావడం వల్ల ప్రమాదకర లక్షణాలు కనబడతాయని, అధిక రక్తపోటుకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. ఈ అధిక రక్తపోటు వల్ల ప్రసవ సమయంలో గుర్రపు వాతము అనగా ప్రీ ఎక్లామ్షియాకి లోనవ్వడం జరుగుతుందని తెలిపారు. గర్భిణులలో ఇది 24 వారాల తర్వాత రావడానికి ఎక్కువ అవకాశం ఉంటుందని, ప్రతి గర్భిణీ రెగ్యులర్‌గా రక్తపోటు పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.నవ్య జీవన్, జిల్లా డిపిహెచ్ఎన్ఒ వెంకటరత్నం, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పిహెచ్ఎన్ పి.ఎలిజిబెత్, స్టాఫ్‌నర్స్ సౌజన్య, ఫార్మసిస్ట్ పివి.స్వామి పాల్గొన్నారు.

ఎండియు వాహనాలను కొనసాగించాలి

సిపిఎం మండల కమిటీ

తాడేపల్లిగూడెం: ప్రజలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉన్న ఎండియు వ్యవస్థను రద్దుచేయడం సరికాదు దీనిని మరింత మెరుగ్గా కొనసాగించాలని సిపిఎం మండల కమిటీ పేర్కొంది. సిపిఎం మండల కమిటీ సమావేశం గురువారం కండెల్లి సోమరాజు అధ్యక్షతన ఇటుకలగుంట గ్రామంలో నిర్వహించారు. ఈ సమావేశంలో జూన్ ఒకటో తేదీ నుంచి ప్రజల ఇంటి వద్దకే రేషన్ బియ్యం సరఫరా నిలిపివేస్తూ రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి తెచ్చుకోవాలని ప్రభుత్వం ప్రకటించిందని, దీనిని ప్రభుత్వం పునరాలోచించి ఎండియు వ్యవస్థను రద్దు చేయకుండా మరింత బలోపేతంగా కొనసాగించాలని సిపిఎం మండల కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పార్టీ మండల కన్వీనర్ పాలుపూరి సత్యనారాయణ మాట్లాడుతూ వాహనాలు ద్వారా ప్రజల చెంతకే రేషన్ బియ్యం ఇవ్వటం, ఇళ్ల దగ్గర తీసుకోవటం జనం అలవాటు పడ్డారని, ఈ పరిస్థితుల్లో రద్దు చేయడం సరికాదన్నారు. అక్రమ రవాణాలను అరికట్టాలంటే ప్రభుత్వం ప్రకటించినట్లు సన్న బియ్యం ఇవ్వాలని వారు కోరారు. బియ్యంతో పాటు ఇతర నిత్యవసర సరుకులు కూడా ఇవ్వాలని, రేషన్ షాపుల దగ్గర కూడా సరుకులు ఇవ్వాలన్నారు. ఎండియు వ్యవస్థను రద్దు చేస్తే వాటిమీద బతికే డ్రైవర్లకు ఉపాధి లేకుండా పోతుందని, కాబట్టి ఎండియు వ్యవస్థను కొనసాగించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే గ్రామాలలో సాధారణ ప్రజల నుంచి వ్యవస్థను రద్దు చేయడం పట్ల వ్యతిరేకత కనబడుతుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పూరెల్ల సుబ్బారావు, పాలుపూరి సత్యవతి, పురిటి గడ్డజయమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం

అంగన్వాడీ సూపర్వైజర్ కె.విశాలాక్షి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం


మాట్లాడుతున్న సూపర్వైజర్ విశాలాక్షి

స్థానిక 35వ వార్డు అంగన్వాడీ సెంటర్‌ను గురువారం వికలాంగుల పిల్లల ఎన్రోల్మెంట్ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ సూపర్వైజర్ కె.విశాలాక్షి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీ సెంటర్లలో చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు పోషకాహారంతో పాటు చిన్నారులకు ఆటల, పాటల ద్వారా విద్యను అందిస్తున్నారని తెలిపారు. బడి వయసు ఉన్న పిల్లలు బడి బయట ఉండరాదని, అంగన్వాడీ సెంటర్లో ఐదు సంవత్సరాలు పూర్తయిన పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని, వివిధ రకాల వైకల్య లోపం ఉన్న పిల్లలను భవిత సెంటర్‌కు పంపించాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలు పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకొని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించాలన్నారు. జూన్ 9వ తేదీ వరకు బడి బయట ఉన్న వికలాంగ పిల్లలను గుర్తింపు కార్యక్రమానికి ప్రత్యేక ఉపాధ్యాయులు ప్రతి అంగన్వాడీ సెంటర్‌కు వస్తారని, అంగన్వాడీ టీచర్స్ వికలాంగ పిల్లల వివరాలు ఉపాధ్యాయులకు అందజేయాలని తెలిపారు. ప్రత్యేక ఉపాధ్యాయుడు ఎస్‌కె.బాల ఈశ్వరయ్య మాట్లాడుతూ సమగ్ర శిక్ష ద్వారా వికలాంగుల పిల్లలకు ఉచితంగా ప్రత్యేక విద్యతోపాటు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరిపితోపాటు అవసరమైన వారికి ఉపకరణాలు, బోధన సామాగ్రి అందించబడతాయని, ప్రభుత్వం వికలాంగుల పిల్లలకు పరీక్షల్లోనూ, ఉద్యోగాల్లోనూ అనేక రాయితీలు కల్పించిందని, వికలాంగ పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు శోభారాణి, విజయ, 35వ వార్డు గ్రామ సచివాలయ ఆరోగ్య కార్యకర్త జ్యోతి పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి పేదల పాలిట వరం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - నరసాపురం

సిఎం సహాయనిధి పేదల పాలిట వరమని ప్రభుత్వ విప్, నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. గురువారం నరసాపురం జనసేన కార్యాలయంలో ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ లబ్ధిదారులకు సిఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తూ, ఈ సహాయం ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని పదకొండు మందికి రూ.6,16,559 చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోటిపల్లి వెంకటేశ్వరరావు, ఆకన చంద్రశేఖర్, కొల్లాటి గోపికృష్ణ, గట్టెం శ్రీను, నిప్పులేటి తారకరామారావు, బల్ల హనుమంతు, పులి భుజంగరావు పాల్గొన్నారు.

'వాహనాల రద్దుతో రేషన్ డీలర్ల హర్షం'

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రజా పంపిణీ వ్యవస్థలో గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రేషన్ వాహనాలను రద్దు చేస్తూ, కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పాలకోడేరు రేషన్ డీలర్లు స్వాగతించారు. గత ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేసిన వాహనాలు ఆచరణలో విఫలమైందని, దానివల్ల రేషన్ డీలర్లు కూడా అనేక ఇక్కట్లు పడ్డారని మండల రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు దొంగ కృష్ణ, ప్రధాన కార్యదర్శి సోము సాయి రామకృష్ణ అన్నారు. తమ సంఘ నాయకులు వాహనాలను రద్దు చేసి, తమ షాపులు తమకే ఇప్పించాలని, అనేక సార్లు విజ్ఞప్తి చేసిన మేరకు కూటమి ప్రభుత్వం ఇన్నాళ్లకు తమ మొర ఆలకించిందని ప్రభుత్వాధినేతలందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

మండలాభివృద్ధికి సహకరించండి : ఎంఎల్ఎ

మొగల్తూరు : మండలాభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఎంఎల్ఎ, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి అందే సూర్యవతి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటున్నామన్నారు. మొగల్తూరు మండలంలో ఆరు పంచాయతీరాజ్ రహదారులకు మోక్షం కలగనుందని, వీటిలో మొగల్తూరు రామాలయం నుంచి శేరేపాలెం వరకూ గల రహదారి పనులు త్వరలో చేపట్టడం జరుగుతుందన్నారు. శాఖల వారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండల స్థాయిలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన పేరుపాలెం, ముత్యాలపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులను అభినందించారు. వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, జెడ్‌పిటిసి తిరుమాని బాపూజీ, తహశీల్దార్ కె.రాజ్ కిషోర్, ఎంపిడిఒ త్రిశూలపాణి ఉన్నారు.

ముగిసిన ఎన్‌సిసి వార్షిక ట్రైనింగ్ క్యాంప్

నరసాపురం: సీతారాంపురం సౌత్‌లోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో గత పదిరోజులుగా నిర్వహిస్తున్న ఎన్‌సిసి వార్షిక ట్రైనింగ్ క్యాంప్ గురువారంతో ముగిసింది. క్యాంప్ సందర్భంగా డ్రిల్, ఫైరింగ్, షిప్ మోడలింగ్‌తో పాటు పలు విభాగాల్లో ప్రతిభ చూపిన క్యాడెట్స్‌కు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న క్యాంప్ లెఫ్టెనెంట్ కమాండర్ సి.రోహిత్ కుమార్, కళాశాల పాలకవర్గ ఛైర్మన్ కెవి.సత్యనారాయణ (కెఎస్) మాట్లాడుతూ ఎన్‌సిసి క్యాడెట్స్‌కు నిర్వహించిన శిక్షణ ద్వారా వారిలో దేశ భక్తి, క్రమ శిక్షణ, సామాజిక అంశాలపై అవగాహన, సమయపాలన అలవడతాయన్నారు. క్యాంప్ ముగింపు సందర్భంగా పలు విభాగాల్లోను, సాంస్కృతిక కార్యక్రమాల్లోను ఉత్తమ ప్రతిభను కనబరిచిన క్యాడెట్లకు బహుమతులు, మెడలను అందజేశారు.

బెల్ట్ షాపు నిర్వాహకుని అరెస్టు

7 మద్యం సీసాల స్వాధీనం

ఆచంట: పాలకొల్లు ప్రోహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గురువారం నిర్వహించిన దాడులలో మండలంలోని పెనుమంచిలి గ్రామానికి చెందిన ఎం.వెంకటరావును అరెస్టు చేసి అతని వద్దనుంచి 5 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ దాడులలో ఎస్ఐలు పి.మహేష్, జి.రఘు, సిబ్బంది పాల్గొన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని తెలియజేశారు.

ప్రకటన

మహారాజశ్రీ పాలకొల్లు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

I.A.No. 47/2025 in O.S.No. 38/2016

Between:

శ్రీమతి కొప్పుల రమాదేవి వగైరా ...పిటిషనర్/వాది

మరియు

కొప్పుల వెంకటరావు (died) 8 వగైరా ...రెస్పాండెంట్/ప్రతివాదులు

To,
R9 Smt. తాళ్ళపోసు లక్ష్మి, భర్త: చంద్రశేఖర్,
పూలపల్లి ఏరియా, పాలకొల్లు మండలం,
పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

పై నెంబరు దావాలో పిటిషనర్ I.A. No. 47/2025 దాఖలు చేసి అందు మిమ్మల్ని 9వ ప్రతివాదిగా జాయిన్ చేయుటకు అనుమతి కోరినందున, శ్రీ కోర్టు వారు నోటీసులు అనేక పర్యాయములు పంపించినప్పటికి మీరు తీసుకోనని కారణముగా శ్రీ కోర్టు వారి అనుమతి మేరకు ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా.

మీ యొక్క హాజరు నిమిత్తం **ది. 19-06-2025వ** తేది వాయిదా కలదు. కావున వాయిదా తేదిన శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా గాని, ప్లీడరు ద్వారా గాని **ఉదయం గం. 10-30 ని॥లకు** హాజరై మీకు అభ్యంతరములున్న యెడల తెలియజేసుకోనగలరు. లేనియెడల మీ పరోక్షమున తదుపరి గ్రంథము వెలువడునని తెలియపరచడమైనది.

ఐ. శివసాంబమూర్తి
కె. రాంబాబు
పాలకొల్లు అడ్వకేట్స్,
ది.20-05-2025 పాలకొల్లు